# నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్, సోమవారం 21 అక్టోబర్ 2024 | ADILABAD NIRMAL




నేరడిగొండలో బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో



కుభీర్ : నినాదాలు చేస్తూ..



కుంటాల : రోడ్డుపై బైఠాయించి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ..



బేలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్లెక్సీని దహనం చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్ఎస్ నాయకులు



ఇచ్చోడలో..



జైనథ్ : ధర్నాలో మాట్లాడుతున్న రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు రమేశ్



ఖానాపూర్ : అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తూ..

### రైతుభరోసా ఎగ్గొట్టడంపై

# బీఆర్ఎస్ భగ్గు

## వ్యవసాయ శాఖ మంత్రి వ్యాఖ్యలపై రైతుల కన్నెర్ర

- ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలవ్యాప్తంగా నిరసనల హోరు
- ర్యాలీలు, రాస్తారోకోలు, ధర్నాలతో అట్టుడికిన జిల్లాలు..
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం
- కాంగ్రెస్ డౌన్.. డౌన్ అంటూ నినాదాలు

*"ప్రస్తుత వానకాలానికి రైతుభరోసా పెట్టుబడి సాయం ఇవ్వడం లేదు. సబ్ కమిటీ రిపోర్టు ఆధారంగానే వచ్చే పంట కాలానికి అంటే యాసంగి నుంచి పెట్టుబడి సాయం అందిస్తాం.. ఎకరాకు రూ.7,500 చొప్పున పంట వేసిన రైతులకు ఇస్తాం.." అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తేల్చి చెప్పడంపై రైతులు, బీఆర్ఎస్ నాయకులు భగ్గుమన్నారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించారు. రహదారులపై బైఠాయించారు. రాస్తారోకోలు, ధర్నాలతో హోరెత్తించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పిలుపు మేరకు అన్ని మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ డౌన్.. డౌన్ అంటూ హోరెత్తించారు.*

ఆదిలాబాద్, అక్టోబర్ 20(నమస్తే తెలంగాణ) : బేల మండలంలో మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ కార్యక్రమంలో రామన్న మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతు భరోసా పథకంలో భాగంగా రూ.15 వేలను ఎలాంటి షరతులు లేకుండా ఇస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఇప్పుడు సాగు చేసిన రైతులు, రాళ్లు, రప్పలు ఉన్న భూములకు ఇస్తామని చెప్పలేదని అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులు ఇచ్చిన మాట తప్పారన్నారు. వానకాలం ముగిసినా రైతుభరోసా అందలేదని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన రికార్డుల ఆధారంగా రైతుబంధు పంపిణీ చేసిందన్నారు. అప్పుడు లేని షరతులు ఇప్పుడు ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను గ్రామాల్లోకి వస్తే రైతు భరోసా విషయంలో నిలదీస్తామన్నారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### నిర్మల్ జిల్లాలో..

వానకాలానికి రైతుభరోసా లేదన్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వ్యాఖ్యలపై ఖానాపూర్ బీఆర్ఎస్ నాయకులు, రైతులు భగ్గుమన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ ఆదేశాల మేరకు ఆదివారం పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా ఎగవేతపై నిరసన చేపట్టారు. రోడ్డుపై బైఠాయించి కాంగ్రెస్ డౌన్.. డౌన్.. అంటూ నినాదాలు చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. రైతుభరోసా ఇవ్వబోమని చెప్పడం సిగ్గు చేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ దస్తురాబాద్ మండల శాఖ అధ్యక్షుడు ముడికే ఐలయ్య యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ భూక్యా రాజు నాయక్‌లు డిమండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ధర్నా నిర్వహించారు. ఎగవేసిన వర్షాకాల రైతుభరోసాను కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కుంటాల మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో మోసపూరిత మాటలు చెప్పి గద్దెనెక్కిన రేవంత్ సర్కారు మూల్యం చెల్లించుకోక తప్పదని బీఆర్ఎస్ కుభీర్ మండల అధ్యక్షుడు అనిల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కుభీర్‌లోని పార్డి(బీ) ఎక్స్‌రోడ్డులోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద రైతు భరోసా ఎగవేతపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లికి పూలమాలలు వేసి రోడ్డుపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేశారు.



దస్తురాబాద్ : ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను చెదర గొడుతున్న పోలీసులు



దగ్ధమైన ఫర్నిచర్

## నిర్మల్ వైద్య కళాశాల దవాఖానలో అగ్నిప్రమాదం

- మొదటి అంతస్తులో షార్ట్ సర్క్యూట్
- రోగులకు తప్పిన పెను ప్రమాదం

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 20 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాల ఆసుపత్రిలో గల మొదటి అంతస్తులో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. మొదటి అంతస్తులోని శానిటేషన్ స్టోర్ రూంలో మంటలు లేచాయి. పొగ పెద్ద ఎత్తున రావడంతో రోగులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏం జరుగుతుందో అని భయపడ్డారు. ఆసుపత్రి సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ సరఫరా నిలిపివేశారు. పై అంతస్తులోని వార్డుల్లోని రోగులను కిందకు దించారు. రోగులు పక్క వార్డులో ఉండడంతో భారీ ప్రమాదం తప్పింది. పొగ రోగుల వార్డుల్లోకి వెళ్లడంతో రోగులు ఇబ్బంది పడ్డారు. ఆసుపత్రి సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. గదిలోని ఫర్నీచర్, వస్తువులు కాలిపోయాయి. కంప్యూటర్ పరికరాలు మసిబారాయి. ఆసుపత్రిని ఆర్డీవో రత్నకల్యాణి, జిల్లా వైద్యాధికారి రాజేందర్, అధికారులు ప్రమాద ఘటనపై ఆరా తీశారు. విద్యుత్ మరమ్మతులు చేశారు. రోగులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ గోపాల్‌సింగ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఆర్ఎంవో సమత ఉన్నారు.

## కుళ్లిన మాంసం.. పురుగులు పట్టిన పప్పు

- హోటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారుల మెరుపుదాడి
- యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం



కుళ్లిన మాంసం



కుళ్లిన ఆహార పదార్థాలను ధ్వంసం చేస్తున్న ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు

ఎదులాపురం, అక్టోబర్ 20 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లు, ఆహార పదార్థాల తయారీ కేంద్రాలపై ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు మెరుపుదాడి చేశారు. కుళ్లిన మాంసం, ఇతర ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి వచ్చిన ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ స్పెషల్ బృందం, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో దాడులు జరిపారు. ముందుగా లక్ష్మీ నరసింహాస్వామి ఫ్యామిలీ రెస్టారెంట్, ఢిల్లీ వాలా స్వీట్ హౌస్, వెంకటేశ్వర స్వీట్‌హౌస్, లోటస్ గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. లక్ష్మీ నరసింహాస్వామి(నాయుడు గారికుండ బిర్యానీ) ఫ్యామిలీ రెస్టారెంట్‌లో రిఫ్రిజిరేటర్‌లో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల ప్రకారం సరైన ఉష్ణోగ్రతను మేయింటేయిన్ చేయకపోవడం, ఫుడ్ గ్రేడ్ లేని ప్లాస్టిక్ కవర్లలో 30 కిలోల రూ.15 వేల విలువ కలిగిన కుళ్లిన మాంసపు ఉత్పత్తులను గుర్తించారు. హానికర రంగులను కలిపిన చికెన్, చేపలు లేబుల్ తదితర వివరాలు లేకుండా ఉన్నటువంటి పన్నీరు మసాలాలు ఉన్నాయి. బూజు పట్టిన కూరగాయలను గుర్తించడంతో హోటల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మాంసం ఉత్పత్తులను ధ్వంసం చేసి యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఈ దాడిలో టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్స్ రోహిత్‌రెడ్డి, పి.స్వాతి, శ్రీశికలతో కూడిన బృందం సభ్యులు ఉన్నారు.

### ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే వారిని ఉపేక్షించబోం..

ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడేవారిని ఉపేక్షించబోమన్నారు. నాసిరకమైన పదార్థాలు వాడడం, కుళ్లిన మాంసం, మసాలాలు వాడడం, వంటగది అపరిశుభ్రంగా ఉండడం వంటి అనేక అంశాలు తన దృష్టికి వచ్చాయని జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి తెలిపారు. ఇకపై ఆహార తయారీదారులు, హోటళ్ల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా విడిచి పెట్టనని వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. శాంపుల్స్ సేకరించి ల్యాబ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## కేసీఆర్ మాటే నిజమైంది

### కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి జోగు రామన్న

బేల, అక్టోబర్ 20 : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే రైతుబంధు ఆగిపోతుందన్న గులాబీ దళపతి కేసీఆర్ మాటలు నిజమయ్యాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. ఈనెల 24న ఆదిలాబాద్ పట్టణంలోని రాంలీలా మైదానంలో నిర్వహించే కేటీఆర్ నిరసన సభకు రైతాంగం కదిలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం బేల మండల ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సభకు భారీ ఎత్తున ప్రజానీకాన్ని తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జోగు రామన్న మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పాయల్ శంకర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎదిరించలేడని విమర్శించారు. తన స్వార్థం కోసం కాంగ్రెస్ మంత్రులకు సన్మానాలు చేయడం మానుకుని రైతుల పక్షాన పోరాడాలని సూచించారు. రైతు భరోసాకు డబ్బులు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం సబ్ కమిటీల పేరిట కాలయాపన చేస్తున్నదని విమర్శించారు. అన్నదాతల సంక్షేమమే బీఆర్ఎస్ తొలి ప్రాధాన్యత అని స్పష్టం చేసిన ఆయన వారికి న్యాయం జరిగేంత వరకు తోడుగా ఉంటామని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రౌత్ మనోహర్, బీఆర్ఎస్ నాయకులు గంభీర్ ఠాక్రే, ప్రమోద్ రెడ్డి, సతీశ్ పవార్, దేవన్న, అరుణ్, జక్కుల మధూకర్, తన్వీర్ ఖాన్, సుదర్శన్, మస్క తేజరావ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## అకాల వర్షంతో పంటలకు నష్టం



బైంసా : మర్లపెల్లిలో దెబ్బ న్న పత్తి పంట

బోథ్/భైంసా టౌన్/ముథోల్, అక్టోబర్ 20 : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో శనివారం అర్ధరాత్రి వర్షం కురిసింది. బోథ్ మండలంలోని కొన్ని ప్రాంతాల్లో గంటన్నరపాటు వర్షంతో కురియడంతో పంటలకు నష్టం వాటిల్లింది. బోథ్, మర్లపెల్లి, పొచ్చెర, కౌఠ(బీ), సొనాల ప్రాంతాల్లో కురిసిన వర్షంతో పత్తి, సోయా పంటలకు నష్టం వాటిల్లింది. సోయాబిన్ పంటతోపాటు కోసి ఉంచిన కుప్పలు, నూర్పిడి చేస్తున్న పనులకు అటంకం ఏర్పడింది. మరోవైపు ఎరే దశకు చేరకున్న పత్తి పంటకు నష్టం తీవ్ర నష్ట కలిగించింది. పత్తి బుగ్గలు వర్షానికి తడిచిపోయాయి. భైంసా మండలంలోని వాలేగాం, కుంసర, కామెల గ్రామాల్లో కుండపోత వర్షానికి కల్లాల్లోని సోయా, వరి ధాన్యం నీటిపాలు అయింది. ఉదయం కల్లాల్లో నిండిన నీటిని తీసివేశారు. ముథోల్ మండల కేంద్రమైన ముథోల్‌తోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి వరి పంట పూర్తిగా నేలమట్టమైంది. కల్లాల్లోని సోయా తడవడంతో ఆర్థికంగా నష్టపోయామని వారు పేర్కొన్నారు. తక్షణమే సర్వే చేయించాలని డిమాండ్ చేస్తున్నారు.



బైంసాటౌన్ : కల్లాల్లో నీటిని తీస్తున్న రైతులు



ముథోల్ : నేల కొరిగిన వరి పైరు



కలెక్టర్ చౌక్‌లో అంధకారం

## అంధకారంలో ఆదిలాబాద్

- నాలుగు గంటలపాటు కరెంట్ కట్
- సెల్‌ఫోన్ టవర్స్ పనిచేయకపోవడంతో సిగ్నల్స్‌కు అంతరాయం

*ఆదిలాబాద్ పట్టణంలో ఆదివారం రాత్రి అంధకారం నెలకున్నది. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు విద్యుత్ నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కొన్ని సెల్‌ఫోన్ టవర్స్ కూడా పనిచేయకపోవడంతో సిగ్నల్స్‌కు అంతరాయం కలిగింది. ఆదివారం కావడంతో ప్రజలు సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి షాపింగ్, హోటళ్లు, కూరగాయలు ఇతర వస్తువులు కొనడానికి రాగా.. విద్యుత్ లేకపోవడంతో వారు ఇబ్బందులు పడ్డారు. ఫ్యాన్లు తిరగకపోవడం వల్ల ఇండ్లలో దోమలు స్వైరవిహారం చేశాయి. పట్టణ శివారులోని సీసీఐ ప్రాంతంలో విద్యుత్‌లైన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.*

*- ఆదిలాబాద్, అక్టోబర్ 20(నమస్తే తెలంగాణ)*